సాక్షి ప్రకాశం

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



భయం వద్దు.. పార్టీ అండగా ఉంటుంది

కూటమి ప్రభుత్వ వేధింపులకు వైఎస్సార్ సీపీ శ్రేణులు భయపడొద్దని, పార్టీ అండగా ఉంటుందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు.

- IIలో..



మెడికల్ కళాశాలల ప్రైవేటుపరం దుర్మార్గం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం
34 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటీరెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

మార్కాపురం సబ్ కలెక్టర్ బదిలీ

మార్కాపురం: మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ బదిలీ అయ్యారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయనను గృహ నిర్మాణశాఖ డిప్యూటీ సెక్రటరీగా బదిలీ చేశారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఒంగోలు రూడ్ సెట్ సంస్థ డైరెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 31 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఆధార్, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు, అభ్యర్థులు తమ పేర్ల నమోదుకు 83099 15577 నంబర్‌నుగానీ, ఒంగోలులోని భాగ్యనగర్ 4వ లైన్ 11వ అడ్డ రోడ్డులో ఉన్న రూడ్‌సెట్ సంస్థ కార్యాలయంలోగానీ సంప్రదించాలని సూచించారు.

ప్రజలందరికీ జీఎస్టీపై అవగాహన అవసరం

- ర్యాలీలో జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు వన్‌టౌన్: జీఎస్టీపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని జేసీ గోపాలకృష్ణ సూచించారు. స్థానిక ప్రకాశం భవన్ వద్ద నుంచి గురువారం ఏర్పాటు చేసిన జీఎస్టీ 2.0 ర్యాలీని జేసీ ప్రారంభించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నెల్లూరు బస్టాండ్ మీదుగా మినీ ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0 సంస్కరణలు తీసుకురావడంతో మెడిసిన్స్, మొదలు అనేక వస్తువులపై జీఎస్టీ తగ్గిందని తెలిపారు. కొన్నింటిని జీఎస్టీ నుంచి పూర్తిగా మినహాయించినట్లు చెప్పారు. వాటన్నింటిపై అవగాహన ఉండాలని సూచించారు. డ్రగ్ కంట్రోలర్ పీఎస్ జ్యోతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీరామమూర్తి, ఒంగోలు రిటైల్ షాప్ అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, వి.వెంకటరావు, వైద్యారోగ్యశాఖ తరఫున డీసీహెచ్‌ఎస్ డాక్టర్ ఎం.శ్రీనివాసనాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సూరిబాబు, ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ భగీరథి, జిల్లా మీడియా అధికారి బెల్లం నరసింహరావు, నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య కార్యకర్తలు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం కొట్టడంతో విద్యార్థినికి ఫిట్స్

- పాఠశాల తనిఖీకి వచ్చిన సబ్ కలెక్టర్‌కు విద్యార్థిని తల్లి ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి..
- హెచ్‌ఎంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఎంఈఓకు సబ్ కలెక్టర్ ఆదేశం




విద్యార్థిని కీర్తన తల్లితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం కొట్టడంతో విద్యార్థినికి ఫిట్స్ వచ్చి ఆస్పత్రి పాలైంది. బుధవారం జరిగిన ఈ సంఘటన గురువారం పాఠశాల తనిఖీకి వెళ్లిన సబ్ కలెక్టర్ త్రివినాగ్‌కు బాధిత విద్యార్థిని తల్లి ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది. హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న కీర్తన అనే విద్యార్థిని తరచూ పాఠశాలకు లేటుగా వస్తుందన్న కారణంతో బుధవారం హెచ్‌ఎం శ్రీదేవి కొట్టడంతో ఫిట్స్‌కు గురవగా, వెంటనే సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. ఇంటికి వెళ్లిన తర్వాత విషయం తెలుసుకున్న విద్యార్థిని తల్లి దేవి గురువారం ఉదయం పాఠశాల తనిఖీ నిమిత్తం సబ్ కలెక్టర్ త్రివినాగ్ వస్తున్నాడని తెలుసుకుని హెచ్‌ఎం శ్రీదేవిపై ఆయనకు ఫిర్యాదు చేసింది. స్పందించిన సబ్ కలెక్టర్.. పాఠశాల హెచ్‌ఎంపై విచారణ చేసి నివేదిక పంపాలని ఎంఈఓను ఆదేశించారు. పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలస్యంగా రావడంపై కూడా ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రేయర్ సమయానికల్లా హాజరుకావాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులు ఉదయం 8.45 గంటల్లోగా పాఠశాలకు చేరుకునేలా వార్డెన్లకు సమాచారం పంపాలని హెచ్‌ఎంలకు సూచించారు. లేకుంటే వార్డెన్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

కేసులు పెడతాం.. కాసులు పిండేస్తాం!

దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్నట్లు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలిసి సహజ సంపదను కొల్లగొడుతున్నారు. కొండలు గుట్టలు తవ్వేసి మట్టిని, నదులు, వాగుల నుంచి ఇసుకను అడ్డగోలుగా అమ్మేసుకుంటున్నారు. ఉచిత ఇసుకకు పంగనామాలు పెట్టి రెట్టింపు ధరలకు విక్రయిస్తూ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. 800 రూపాయలకు టన్ను ఇసుక అమ్మాల్సి ఉండగా, రూ.1500కు బహిరంగంగా విక్రయిస్తూ నెలకు రూ.2.75 కోట్లు బొక్కేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతో, ప్రజా ప్రతినిధులు వెన్నుదన్నుతో అక్రమాలకు పాల్పడుతున్నా అధికారులు ఏమీ చేయలేని దుస్థితిలో చేతులుడిగి చూస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

- నెలకు రూ.2.75 కోట్ల దోపిడీ చేస్తున్న పచ్చదండు
- రీచ్‌లో టన్ను ఇసుక రవాణా చార్జీలతో కలిపి రూ.800
- కూటమి డంపుల్లో రూ.1300 నుంచి రూ.1500
- లారీ ఇసుక రూ.52 వేలు, రవాణా ఖర్చులు అదనం
- రూ.500 నుంచి రూ.700 వరకూ ఎల్లో ట్యాక్స్
- అనధికార ఇసుక స్టాక్ పాయింట్లతో దందా



ఎల్లో ట్యాక్స్ రూ.700...

ప్రభుత్వం రవాణా ఖర్చులు కలుపుకుని టన్ను ఇసుక 800 నుంచి 900 రూపాయలుగా నిర్ణయించింది. జిల్లాలో 9 స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఈ పాయింట్లన్నీ టీడీపీ ఎమ్మెల్యేల అనుచరులకు కట్టబెట్టడంతో ఇసుక విక్రయాలలో అక్రమాలకు అంతేలేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రెట్టింపు ధరకు ఇసుక విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. టన్ను ఇసుక రూ.1300 నుంచి రూ.1500కు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన ధరకంటే 700 రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో ఇసుక కొనాలంటే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. మధ్యతరగతి, సామాన్య ప్రజలు భవన నిర్మాణాలు చేసుకోవడానికి వెనుకడుగేసే పరిస్థితి నెలకొంది. జిల్లాలో 1.5 లక్షల భవన నిర్మాణ కార్మికులు పనులు లేక పస్తులు పడుకుంటున్నామని వాపోతున్నారు.

ఉచిత ఇసుక హామీని నిలబెట్టుకోవాలి



ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. గత ప్రభుత్వం కంటే అధిక ధరకు ఇసుక అమ్ముతున్నారు. ప్రతి మండలంలో ఐదు నుంచి పది మంది లూజు ఇసుక అమ్ముకుని జీవించేవారు. బలవంతంగా వారిని అమ్ముకునే పరిస్థితి లేకుండా చేశారు.

– దాకాల పుల్లయ్య, రైతు సంఘ నియోజకవర్గ కార్యదర్శి

బేస్తవారిపేట:

జిల్లాలో వందలాదిమంది ఇసుక వ్యాపారులున్నారు. ఏళ్ల తరబడి ఇసుక అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. సుమారు 400 నుంచి 500 మంది ఇసుక విక్రయాలపై బతుకుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారికి కష్టాలు మొదలయ్యాయి. ఇసుక రీచ్ల నుంచి ఇసుక తెచ్చుకుని అమ్ముకోకుండా వారిపై ఒత్తిడి చేయడం, పోలీసు కేసులతో బెదిరించడంతో పాటు భయాందోళనకు గురిచేశారు. ఇసుక వ్యాపారుల టిప్పర్లను ధ్వంసం చేయడమే కాకుండా రోజుల తరబడి వారి ఆధీనంలో పెట్టుకుని వేధించారు. దాంతో టిప్పర్ యజమానులు, ఇసుక వ్యాపారులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అయినప్పటికీ పచ్చనేతలు ఊరుకోలేదు. ప్రైవేటు వ్యాపారులు ఇసుక అమ్మడానికి వీల్లేదని ఆంక్షలు విధించారు. ఎవరైనా ఇసుక తెచ్చుకున్నా తమ ఇసుక స్టాక్ పాయింట్లో, చెప్పిన ధరకే అన్లోడ్ చేయాలని హుకుం జారీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో గత్యంతరం లేక ఇసుక వ్యాపారులు కూలి పనులకు వెళ్తున్నారు. కొందరు మాత్రం పచ్చనేతలతో బేరం కుదుర్చుకుని స్టాక్ పాయింట్‌కు ఇసుక తరలిస్తున్నట్లు తెలుస్తోంది.



కంభంలో భారీగా ఇసుక డంప్



అర్ధవీడులో స్టాక్ పాయింట్‌లో నిల్వ చేసిన ఇసుక

నెలకు రూ.2.75 కోట్ల దోపిడీ...

జిల్లాలో నెలకు 50 నుంచి 65 వేల టన్నుల ఇసుక విక్రయాలు జరుగుతున్నట్లు అధికారుల అంచనా. ప్రతి టన్నుపై టీడీపీ నాయకులు 500 నుంచి 700 రూపాయలు అధికంగా ఎల్లో ట్యాక్స్ వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంటే నెలకు రూ.2.75 కోట్లకుపైగా అక్రమంగా వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ఈ లెక్కన ఏడాదికి సుమారు 40 కోట్ల రూపాయలకు పైగా తమ్ముళ్లు జేబులు నింపుకుంటున్నారని సమాచారం. ఇంత భారీ మొత్తం దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వ పెద్దలు ఇంకా ఉచిత ఇసుక గురించి మాట్లాడుతుండటంపై సామాన్యులు మండిపడుతున్నారు. ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలో పరిస్థితిని పరిశీలిస్తే.. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల్లో దాదాపుగా నెలకు 8500 టన్నుల ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. ప్రైవేట్ వ్యక్తులు లారీలో ఇసుక తీసుకొస్తే టన్ను రూ.800కు స్టాక్ పాయింట్‌లో దించాలి. అధికార పార్టీ ప్రజాప్రతినిధి అనుచరులు టన్ను రూ.1200 ప్రకారం స్టాక్ పాయింట్లకు చేరవేస్తున్నారని తెలుస్తోంది. టన్నుకు అదనంగా రూ.400 నుంచి రూ.700 దండుకుంటున్నారు. 8500 టన్నులకు నెలకు రూ.34 లక్షలు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గతంలో రాచర్ల మండలం రంగారెడ్డిపల్లె సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై ఇసుక స్టాక్ పాయింట్‌ను అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రతి మండలంలో ఇసుక స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేసి టీడీపీ నేతలకు అప్పగించారు. వీరు అదనపు దోపిడీకి తెరలేపారు. బేస్తవారిపేట జంక్షన్, కొమరోలు, రాచర్ల మండల కేంద్రాల్లో టన్ను రూ.1300, అర్ధవీడులో టన్ను రూ.1500, గిద్దలూరులో టన్ను రూ.1200, కంభంలో రూ.1500కు విక్రయిస్తున్నారు. మండల కేంద్రం నుంచి పల్లెలకు ట్రాక్టర్లతో ఇసుక తరలించడానికి అదనపు భారం పడుతోంది. గతంలో 40 టన్నుల లారీ ఇసుక రూ.34 వేల నుంచి రూ.36 వేలకు వచ్చేది. నేడు రూ.52 వేలు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది.

బాడుగ అదనం...

తరలించే దూరాన్ని బట్టి టన్నుకు రూ.200 నుంచి రూ.400 బాడుగ అదనంగా చెల్లించాలి. అరకొరగా అవసరమైన ఇసుకను తెచ్చుకోవాలంటే బాడుగ ఖర్చులు భారంగా మారుతున్నాయి. మార్కాపురం, దర్శి, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో స్టాక్ యార్డ్ పేరుతో ఈ దందా జరుగుతోంది.

ఇతర లారీలు ససేమిరా...

ఇసుక కాంట్రాక్ట్ దక్కించుకున్న ఎమ్మెల్యేల అనుచరులు ఇసుక అమ్మకాలపై డేగకన్ను వేశారు. లూజుగా ఇసుక అమ్ముకునే వ్యక్తుల వద్దకు వెళ్లి కేసులు పెడతామని బెదిరింపులకు దిగుతున్నారు. గతంలో బాడుగలకు వెళ్లిన లారీలు ఖాళీగా తిరిగి వచ్చే సమయంలో ఇసుక తెచ్చుకునేందుకు కొంత వెసులుబాటు ఉండేది. వారిని పోలీసులతో బెదిరించి పోలీస్‌స్టేషన్లలో లారీలను పెట్టడంతో వారు చెప్పిన ధరకే డంపింగ్ యార్డ్‌లో అన్‌లోడ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

బెల్టు, కల్తీ మద్యంపై ఆందోళన చేస్తాం

- ప్రభుత్వం కళ్లు తెరుచుకుని కల్తీ మద్యాన్ని నివారించాలి
- బెల్టు దుకాణాలు లేకుండా చేయాలి
- పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో 17 మెడికల్ కళాశాలలు ప్రారంభించాం
- వాటి ప్రైవేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు సిటీ: ప్రజల పక్షాన నిలబడి బెల్టుషాపులు, కల్తీ మద్యంపై ఆందోళన చేస్తామని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన.. మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యంకి ఆస్కారం లేకుండా ప్రభుత్వమే మద్యాన్ని విక్రయించిందన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పాలసీ మార్చేసిందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు మద్యం దుకాణాలన్నీ కూటమి నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయని ఆయన ఆరోపించారు. బెల్టు షాపుల ద్వారా కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయన్నారు. వారం రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు చూస్తున్నామని, రకరకాల అంశాలు ప్రచారంలో ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి కల్తీ మద్యాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బెల్టుషాపులు మూసివేస్తే కల్తీ మద్యానికి ఆస్కారం ఉండదన్నారు.

లిక్కర్ స్కాం పేరుతో అక్రమ అరెస్టులు...

ఏమీ లేని దానికి తమ ప్రభుత్వ హయాంలో లిక్కర్ స్కాం జరిగిందంటూ అక్రమ అరెస్టులు చేస్తూ భూతద్దంలో చూపిస్తున్నారని వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 17 మెడికల్ కళాశాలలు ప్రారంభించామన్నారు. లక్షలు వెచ్చించి ఖరీదైన వైద్యాన్ని పేదలు చేయించుకోలేక ప్రాణాలు పోగొట్టుకోకూడదనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలలు ప్రారంభించామన్నారు. వాటికి అనుబంధంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వస్తుందని, ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్న గొప్ప ఆలోచనతో వాటిని ప్రారంభించామని అన్నారు. వాటిని పూర్తి చేస్తే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న కుట్రతో కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తెస్తోందన్నారు. ప్రైవేటీకరణను ప్రజలు సైతం వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రైవేటీకరణతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించేందుకు తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించుకున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నర్సీపట్నంలో నిర్మాణం మొదలుపెట్టిన కళాశాల వద్దకు ఆయన వెళ్తున్నారన్నారు. ఒక్కరోజులో అన్ని భవనాల నిర్మాణాలు పూర్తికావని, నర్సీపట్నంలో ఏమీలేదన్న స్పీకర్ ప్రకటనపై వాస్తవాలు చూపించేందుకు తమ పార్టీ అధినేత వెళ్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై పాలకులను నిలదీసే హక్కు ఎవరికైనా ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చేయలేమని చెప్పడం సరికాదని, జెడ్ ప్లస్ కేటగిరీ ఉన్న వ్యక్తికి ఆ స్థాయిలో రక్షణ కల్పిస్తే ఎలాంటి సంఘటనలు జరిగేందుకు ఆస్కారం ఉండదని వైవీ అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో మెడికల్ కళాశాలలు, వైద్యశాలలు ఉంటే మెరుగైన వైద్యం అందుతుందా..లేదా..? అన్నది ప్రజలు కూడా గమనించాలన్నారు. డీఎస్సీ పారదర్శకంగా జరగలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. దానిపై విచారణ జరిపించి అర్హులైన వారికి అవకాశం కల్పించాలన్నారు. వైవీ సుబ్బారెడ్డి వెంట వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శులు కె.వి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరోగ్య శ్రీ సేవలు బంద్

- జిల్లాలోని ఆస్పత్రులకు రూ.150 కోట్ల వరకూ ఆరోగ్య శ్రీ నిధుల బకాయిలు
- 5 నెలలుగా డిశ్చార్జి క్లెయిమ్ షీటును పరిశీలించకుండా దగా

ఒంగోలు టౌన్: జిల్లాలోని ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు నేటి నుంచి నిలిచిపోనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ఆరోగ్య శ్రీ మీద కక్ష సాధింపులు మొదలుపెట్టింది. ఈ క్రమంలో నిరుపేద, సామాన్య ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు చెల్లించాల్సిన కోట్లాది రూపాయల బిల్లులను రకరకాల సాకులతో నిలిపివేసింది. జిల్లాలో 120కిపైగా ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ సేవలందిస్తున్నాయి. ఆరోగ్య శ్రీ ట్రస్ట్‌లో అనుమతి తీసుకున్న తర్వాత రోగికి చికిత్స చేయడం ప్రారంభిస్తారు. డిశ్చార్జి చేసిన తర్వాత 15 రోజుల్లోపు క్లెయిమ్ పెట్టుకోవాల్సి ఉంటుంది. నిబంధనలు ఇలా ఉండగా, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్య శ్రీ నిబంధనలను స్వయంగా ప్రభుత్వమే పాటించడం మానేసిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత 5 నెలలుగా డిశ్చార్జి క్లెయిమ్‌లను పరిశీలించకుండా పక్కన పెట్టేసినట్లు విశ్వసనీయ సమాచారం. అంతేగాకుండా సోషల్ ఆడిట్ పేరుతో కూడా బిల్లులు చెల్లించకుండా వాయిదాలు వేస్తున్నట్లు తెలుస్తోంది. దాంతో భారీగా బిల్లులు పేరుకుపోతున్నాయి. జిల్లాలోని ఆరోగ్య శ్రీ ఆస్పత్రులకు 150 కోట్ల రూపాయల వరకు బిల్లులు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో పశ్చిమ ప్రకాశంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో విషజ్వరానికి చికిత్స చేసి 8 నెలలు గడుస్తున్నప్పటికీ బిల్లులు రాకపోవడంతో ప్రైవేటు వైద్యశాలల నిర్వాహకులు విసుగుచెందుతున్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) వైద్యులు కొంతకాలంగా ఆరోగ్య శ్రీ బకాయిల కోసం చేయని ప్రయత్నం లేదు. అయినప్పటికీ బిల్లులు చెల్లించని కూటమి ప్రభుత్వం.. ఆయా ఆస్పత్రులలో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు నిలిపివేయకుండా చేసేందుకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు సరికదా.. వారిపై పోలీసుల ద్వారా ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గత్యంతరం లేక ఆరోగ్య శ్రీ ఆస్పత్రులలో శుక్రవారం నుంచి ఆరోగ్య శ్రీ ద్వారా వైద్య సేవలు బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 25వ తేదీ కార్యాచరణ ప్రకటించిన ఆషా వైద్యులు ఇప్పుడు కార్యాచరణలోకి దిగారు.

గ్రామీణ ప్రజల్లో భయాందోళన...

జిల్లాలో ఒకవైపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మె చేస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన 30 శాతం ఇన్ సర్వీసు కోటాను రద్దు చేసి 15 శాతానికి కుదించడం పట్ల పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలోకి దిగారు. వారం రోజులు గడుస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. చాపకింద నీరులా డెంగీ ప్రబలుతోంది. దర్శి, చీమకుర్తి, గిద్దలూరు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, దోర్నాల, అర్ధవీడు ప్రాంతాలలో మలేరియా లక్షణాలతో కూడిన జ్వరాలు కనిపిస్తున్నాయి. చికున్ గున్యా తీవ్రంగా ఇబ్బందులు పెడుతోంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఉబ్బసం వంటి శ్వాసకోశ వ్యాధులు చిన్నారులు, వృద్ధులను ఇబ్బంది పెడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ముందస్తు చర్యలతో ప్రజలకు భరోసా కల్పించాల్సిన పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సక్రమంగా వైద్య సేవలు అందక గ్రామీణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోనీ పట్టణాలకు వెళ్లి ఆరోగ్య శ్రీ పథకం కింద పెద్దాస్పత్రులలో వైద్యం చేయించుకుందామనుకుంటే ఇప్పుడు ఆ సేవలు కూడా నిలిచిపోయాయి. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఏం చేయాలని నిరుపేదలు, సామాన్యులు భయాందోళన చెందుతున్నారు. మెడికల్ మాఫియా ప్రయోజనాల కోసమే కూటమి పాలకులు సమస్యలు సృష్టిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సెకండరీ గ్రేడ్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తి

- సోమవారం నుంచి విధుల్లోకి..



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

కనిగిరి రూరల్: మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన సెకండరీ గ్రేడ్ టీచర్లకు కౌన్సెలింగ్ పూర్తయినట్లు డీఈఓ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆల్ఫా అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ కిరణ్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి వారికి స్థానాలు కేటాయించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ జిల్లాలో 124 మంది సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైనట్లు తెలిపారు. వారికి ఈ నెల 3వ తేదీ నుంచి రెసిడెన్షియల్ తరహాలో శిక్షణ ఇచ్చామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శిక్షణ కేంద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. సోమవారం నుంచి వారంతా కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌లో మండల విద్యాశాఖ అధికారులు యూవీ నారాయణరెడ్డి, జి.సంజీవి, రాజాల కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన అండర్-19 క్రీడాకారులు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లను గురువారం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో ఎంపిక చేశారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి చింపారెడ్డి, ఎంపిక కమిటీ చైర్మన్, అండర్-19 చీఫ్ అడ్వైజర్ బొడ్డు సుబ్బారావు, పీడీ శివశంకరరావు, రాజ్యలక్ష్మి, కౌసల్య, కోచ్ అన్వర్ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. ఏబీఎం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డి.వాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు


108లో క్షతగాత్రులు

దర్శి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సాయినగర్ సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే..గంగదేవిపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జునరావు, పద్మజలు బైక్‌పై వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడి గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వారిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు.

స్పా సెంటర్లలో తనిఖీలు


నగరంలోని ఒక స్పా సెంటర్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

ఒంగోలు టౌన్: నగరంలోని స్పా సెంటర్లలో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నగరంలోని సీఐలు, ఎస్సైలతో కూడిన 9 బృందాలు నగరంలోని 9 స్పా సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్పా సెంటర్ల నిర్వహణకు సంబంధించిన లైసెన్సులు, అనుమతులు, స్పా సెంటర్లలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను పరిశీలించారు. స్పా సెంటర్లలోని సీసీ కెమెరాలు ఏర్పాటు, వాటి పనితీరు, అంతర్గత నిర్మాణ శైలి వంటివాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ...స్పా, మసాజ్ సెంటర్ల పేరుతో చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. తనిఖీల్లో ఒన్‌టౌన్ సీఐ నాగరాజు, సబ్ డివిజన్ ఎస్సైలు నాగమల్లేశ్వరరావు, సుధాకర్, పున్నారావు, అజయ్‌బాబు, వెంకటసైదులు, నాగేంద్ర కుమార్, ఫణిభూషన్ పాల్గొన్నారు.

కత్తితో దాడిచేసి ఆటో తీసుకొని పరార్


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

దొనకొండ: బాడుగకు ఆటో మాట్లాడుకుని డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి ఆటోను తీసుకుని గుర్తు తెలియని వ్యక్తి పరారయ్యాడు. ఈ సంఘటన గురువారం సాయంత్రం మండలంలోని మల్లంపేట సమీపంలో జరిగింది. ఎస్సై టి.త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురానికి చెందిన నాగరాజు ఆటోను దొనకొండకు గుర్తు తెలియని వ్యక్తి రూ.600 కిరాయికి మాట్లాడుకున్నాడు. మార్కాపురం నుంచి మల్లంపేట మీదుగా దొనకొండకు బయల్దేరారు. ఆటో మల్లంపేట గ్రామం దాటిన వెంటనే ఆటోలో కూర్చున్న గుర్తు తెలియని వ్యక్తి డ్రైవర్ నాగరాజుపై కత్తితో దాడి చేసి కింద పడేసి ఆటో తీసుకుని పరారయ్యారు. గాయపడిన నాగరాజు సమీపంలోని మల్లంపేటకు చేరుకుని గ్రామస్తుల సహకారంతో చికిత్స నిమిత్తం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సమాచారం తెలుసుకున్న దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందుతుడి కోసం గాలింపు వేగవంతం చేయాలని పోలీస్ సిబ్బందికి ఆయన సూచించారు.

సమస్యలు పరిష్కారానికి పోరాటాలే మార్గం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

దర్శి: ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని మాజీ శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. సీఐటీయూ, యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదికల అధ్వర్యంలో తాండవ రంగారావు అధ్యక్షతన తాలూకా క్లబ్ సమావేశం హాలులో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు 42 రోజులు సమ్మె చేసినప్పుడు వేతనాలు పెంచుతామని ఇచ్చిన వాగ్దానం నేటికీ అమలు కాలేదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, 6 డీఏలు ఇవ్వాల్సి ఉన్నా ప్రకటించడం లేదని, అందుకోసం పోరాటాలు తప్ప మరో మార్గం లేదని స్పష్టం చేశారు. ముందుగా ప్రపంచ విప్లవకారుడు చేగువేరా వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి, యూటీఎఫ్, జేవీవీ నాయకులు మీనిగ శ్రీనివాసరావు, రాజశేఖర్, ఫాతిమా, తిరుపతమ్మ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేట్‌పరం దుర్మార్గం

● వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి


మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, పక్కన చుండూరి రవిబాబు, ఇతర నేతలు

ఒంగోలు సిటీ: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయాలని చూడటం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గ్రామ/వార్డు రచ్చబండ ద్వారా సంతకాలు సేకరిస్తామన్నారు. కొండపి నియోజకవర్గంలోని పాకల గ్రామంలో 10వ తేదీ ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఒంగోలులో సంతకాల సేకరణ చేస్తామన్నారు. అక్టోబర్ 28న ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం నవంబర్ 12న జిల్లా కేంద్రంలో ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 23న నియోజకవర్గాల కేంద్రాల నుంచి సంతకాలు చేసిన వినతిపత్రాలు జిల్లా కేంద్రాలకు వచ్చే కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యేలు లేదా ఇన్‌చార్జిలు జెండా ఊపి ప్రారంభించాలని తెలిపారు. నవంబర్ 24న సంతకాలు చేసిన వినతిపత్రాలను జిల్లా కేంద్రం నుంచి కేంద్ర కార్యాలయానికి చేర్చే కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు జెండా ఊపి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ జాబితాలను గవర్నర్ అపాయింట్‌మెంట్ బట్టి పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్‌కు అందజేసే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో ప్రవేశపెట్టిన 104, 108 వాహనాలను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో సామాన్యుడికి వైద్యం అందే పరిస్థితి కనిపించడం లేదని మండిపడ్డారు.

పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్నదే లక్ష్యం..

పేదలకు వైద్యం అందుబాటులోకి రావాలన్న లక్ష్యంతోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకువచ్చారన్నారు. అందులో 7 మెడికల్ కళాశాలలు నిర్మాణాలు పూర్తికాగా, 10 కళాశాలలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కానీ టీడీపీ నాయకులు నిత్యం అబద్ధాలు వల్లె వేస్తూ ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇంతటి దుర్మార్గమైన ఆలోచనలు మానుకోవాలని హితవు పలికారు. కనీసం ఓట్లు వేసిన ప్రజల కోసమైనా టీడీపీ నాయకులు నిజాలు మాట్లాడాలన్నారు. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అందుకే కోటి సంతకాలను సేకరిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాలలు ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్‌పరం కానివ్వకుండా వైఎస్సార్ సీపీ పోరాడుతుందని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ పార్లమెంట్ కార్యదర్శి కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర పార్లమెంట్ కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్, జాయింట్ సెక్రటరీ బొగ్గుల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భయం వద్దు.. పార్టీ అండగా ఉంటుంది


రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డితో వైఎస్సార్ సీపీ ఒంగోలు 45వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు

● వైఎస్సార్ సీపీ శ్రేణులకు రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి భరోసా

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వ వేధింపులకు వైఎస్సార్ సీపీ శ్రేణులెవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి భరోసా ఇచ్చారు. వినాయకుని నిమజ్జనంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటలు పెట్టారనే అక్కసుతో ఒంగోలు 45వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ వర్గీయులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి అక్రమ కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపగా, బెయిల్‌పై బయటకు వచ్చిన వారు గురువారం వైవీ సుబ్బారెడ్డిని కలిశారు. నిమజ్జనం రోజు ఏం జరిగిందో వైవీకి వివరించారు. మహిళల పట్ల కూడా పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, 50 మందికిపైగా వైఎస్సార్ సీపీ వారిపై అక్రమ కేసు బనాయించారని తెలిపారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి ప్రజల్లో పెరుగుతున్న బలాన్ని చూసి భయపడుతున్న కూటమి పాలకులు వైఎస్సార్ సీపీ శ్రేణులను భయాందోళనకు గురి చేసే విధంగా పోలీసులను అడ్డం పెట్టుకుని అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అక్రమ కేసులో బాధితులకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, లీగల్ సెల్ న్యాయవాదులు పెన్నా నాగరాజు, ధర్నాసి హరిబాబు, జయచంద్ర నాయక్, అలికేపల్లి యగ్నేశ్వరరెడ్డి, కోడూరి రవిబాబును వైవీ సుబ్బారెడ్డితో పాటు పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు అభినందించారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ వెన్నపూస కుమారి, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రవణమ్మ ఉన్నారు.

ముగిసిన అంతరిక్ష వారోత్సవాలు


ప్రాజెక్టులు పరిశీలిస్తున్న విద్యార్థులు


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

● రెండో రోజు స్పేస్ ఎగ్జిబిషన్‌కి విశేష స్పందన

ఒంగోలు సిటీ: సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం, ఇస్రో, క్విస్ ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అంతరిక్ష వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన షార్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇస్రోలో చేసిన వివిధ ప్రయోగాల గురించి వివరించారు. రానున్న కాలంలో మరిన్ని ప్రయోగాలు చేస్తామన్నారు. గగన్‌యాన్ తదితర ప్రాజెక్టుల గురించి విద్యార్థులకు వివరించారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రభుత్వం సైన్సు రంగంలో ఎన్నో ప్రాజెక్టులు చేపట్టనుందన్నారు. భారతీయ అంతరిక్ష స్టేషన్‌ను నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది లివ్ ఇన్ స్పేస్ కాన్సెప్ట్‌తో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రజల్లో, విద్యార్థుల్లో సైన్సు గురించి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వారోత్సవాలకు ఏర్పాటు చేసిన క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి గాయత్రి దేవిలకు కృతజ్ఞతలు తెలిపారు.

3 వేల మంది విద్యార్థుల సందర్శన

అంతరిక్ష వారోత్సవాలకు వివిధ పాఠశాలలు, కాలేజీలకు చెందిన విద్యార్థులు 3 వేల మంది హాజరయ్యారు. స్పేస్ ఎగ్జిబిషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పోని తిలకించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఎక్స్ పో, పెయింటింగ్ పోటీలు, క్విజ్, పోస్టర్ ప్రజంటేషన్ తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. క్విస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, డీపీఎస్ ఆర్ డైరెక్టర్ డాక్టర్ బీవీ సుబ్బారావు, వరల్డ్ స్పేస్ వీక్ – 2025 ఒంగోల్ సబ్ కమిటీ చైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్య, ఇస్రో అధికారులు రామాంజనేయులు, అప్పారావు, శివ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెయిల్‌పై విడుదలైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

ఒంగోలు టౌన్: నగరంలో వినాయకచవితి పండుగ సందర్భంగా నిర్వహించిన నిమజ్జనం ఊరేగింపులో పోలీసులతో చోటుచేసుకున్న తోపులాట ఘటనలో అక్రమంగా అరెస్టయి రిమాండ్‌లో ఉన్న ఒంగోలు 45వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం రెగ్యులర్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ ఘటనలో కూటమి ప్రభుత్వం 50 మంది గణేష్ భక్తులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. అరెస్టయిన వారిలో మడతల వాసురెడ్డి, పల్నాటి రవీంద్రారెడ్డి, చందోలు చెంచిరెడ్డి, రాజనాల చైతన్య కుమార్‌రెడ్డి, దేవిరెడ్డి విక్రమ్ రెడ్డి, దేవిరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, మడతల మహేంద్ర కుమార్‌రెడ్డి, చిలకల మహేంద్రరెడ్డి రెగ్యులర్ బెయిల్ మీద విడుదలయ్యారు. వీరితోపాటు ముందస్తు బెయిల్ మీద కోర్టులో సరెండరైన రాజనాల వెంకట మణీంద్ర గురుబాబు, పల్నాటి విష్ణువర్ధన్ రెడ్డి, పల్నాటి వెంకటేశ్వర్లు, వెన్నపూస వెంకటేశ్వర రెడ్డి కూడా విడుదలయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గణేష్ భక్తుల విడుదలకు సహకరించిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు నగరికంటి శ్రీనివాసరావు, పెన్నా నాగరాజు, ధర్నాసి హరిబాబు, జయచంద్ర నాయక్, అలికేపల్లి యగ్నేశ్వరరెడ్డి, కోడూరి రవిబాబును అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


సంఘటనా స్థలంలో పేరయ్య మృతదేహం


విలపిస్తున్న మృతుని కుటుంబీకులు


రోడ్డుపై బైఠాయించిన మృతుని కుటుంబసభ్యులు

● మరొకరి పరిస్థితి విషమం
● మేడపి–మానేపల్లి రోడ్డులో ప్రమాదం

త్రిపురాంతకం: బొలేరా వాహనం, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మేడపి – మానేపల్లి రోడ్డులో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. త్రిపురాంతకం మండలం గణపవరానికి చెందిన మందా పేరయ్య (22), మందా కోటేష్‌లు పుల్లలచెరువు మండలం ఐటీవరంలో ఉన్న తల్లి కోటమ్మ వద్దకు వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో పేరయ్య అక్కడికక్కడే మృతి చెందగా కోటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వీరిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల పిల్లలు. బేల్దారీ పనుల నిమిత్తం గురువారం రాత్రి హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ప్రమాదం జరిగింది. దీంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. మృతుడు పేరయ్య తండ్రి అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. బొలేరా వాహనంలో ప్రయాణిస్తున్న ఐటీవరానికి చెందిన కొన్ని కుటుంబాలు రవ్వారంలోని గురప్పస్వామి దేవాలయానికి వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. వారికి చిన్న చిన్న గాయాలయ్యాయి. సీఐ అసాన్, ఎస్సై శివబసవరాజులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో మృతి చెందిన పేరయ్య కుటుంబసభ్యులు తమకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వారితో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.


పేరయ్య (ఫైల్)

చట్టాలపై అవగాహన అవసరం


పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది


నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

● ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఒంగోలు టౌన్: కొత్త చట్టాలపై పోలీసు అధికారులంతా పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉంలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సూచించారు. నూతన చట్టాలకు అనుగుణంగా రూపొందించిన రిజిస్టర్లను నిక్కచ్చిగా నిర్వహించడం తప్పనిసరని స్పష్టం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని గెలాక్సీ కాంప్లెక్స్‌లో గురువారం నూతన చట్టాలపై పోలీసు అధికారులు, పోలీస్‌స్టేషన్ల రైటర్లు, అసిస్టెంట్ రైటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డిజిటలైజేషన్, వేగవంతమైన న్యాయం లక్ష్యంగా నూతన చట్టాలను రూపొందించినట్లు వివరించారు. జీరో ఎఫ్ఐఆర్, ఈ ఎఫ్ఐఆర్‌లను సమర్థవంతంగా అమలు చేయడంలో రికార్డులు కీలకమని చెప్పారు. అధికార పరిధితో సంబంధం లేకుండా నమోదు చేసే జీరో ఎఫ్ఐఆర్, దర్యాప్తు పురోగతి వివరాలు, ఈ సమన్స్ పంపే ప్రక్రియ, నేర దృశ్యాల వీడియో రికార్డింగ్, ఈ ఎవిడెన్స్ వంటి డిజిటల్ విధానాలకు సంబంధించిన రిజిస్టర్లు కొత్త విధానం ప్రకారం నిర్వహించాలని సూచించారు. రికార్డులన్నింటినీ ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రిలిమినరీ ఎంక్వైరీ రికార్డుల విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల దర్యాప్తును రెండు నెలల్లో పూర్తి చేయడానికి సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. నేరాల దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. కొత్త చట్టాల అమలుతో పోలీసుల జవాబుదారీతనం, పారదర్శకత మరింత పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ దేవప్రభాకర్, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, టూటౌన్ సీఐ మేడా శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉద్యమిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

● మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: కూటమి ప్రభుత్వం ఏకపక్షంగా మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేయాలని చూస్తుందని, దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడిక్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేట్‌పరం చేసి పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకే కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నిందన్నారు. దీనికి నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు సంతకాలు సేకరణ, రచ్చబండ కార్యక్రమాన్ని జిల్లాలో తొలుత పాకల గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. పేద విద్యార్థులు, పేద ప్రజల కోసం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు పూనుకుంటే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్‌పరం చేసి సొమ్ము చేసుకునేందుకు యత్నిస్తుందని మండిపడ్డారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. పాకలలోని అభ్యుదయ కళ్యాణమండపంలో జరిగే కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వై వెంకటేశ్వరరావు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ మాదాసి వెంకయ్య పాల్గొంటారన్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ విభాగాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, చొప్పర వెంకన్న, రాపూరి ప్రభావతి, నరేందర్‌రెడ్డి, షేక్ మహమ్మద్‌బాషా, షేక్ సుల్తాన్, యనమల మాధవి, చుక్కా కిరణ్ కుమార్, దాసు శ్రీను, గొల్లపోతు గోవర్దన్, నరేష్, పటేల్, కోమట్ల వెంకారెడ్డి, గాలిబుజ్జి, బుజ్జమ్మ, పెరికాల సునీల్, కుంచాల రవి, చొప్పర శివ, షేక్ అల్లా భక్షు, సోమిశెట్టి సురేష్, రావినూతల అంకయ్య, ఎం భాగ్యలక్ష్మి, కేశవరపు నవీన్‌రెడ్డి, ఎం జెస్సిపాల్, షేక్ కరీం, మాదాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలకు మినహాయింపు ఇవ్వండి


డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆదిలక్ష్మి, డీఆర్‌ఓ ఓబులేసుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీ నుంచి బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమం బహిష్కరిస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో బోధనా సమయం హరించుకుపోతోందన్నారు. ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గేలా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని, పలు దఫాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని, మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులను గానీ, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం గాని, విద్యా శక్తి, జీఎస్టీ 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో చైర్మన్ కె.ఎర్రయ్య ఫ్యాప్టో డిప్యూటీ సెక్రటరీ జనరల్ షేక్ అబ్దుల్ హై, ఫ్యాప్టో కో చైర్మన్ వి.మాధవరావు, సభ్యులు డి.శ్రీనివాసులు, పీవీ సుబ్బారావు, జి.ఉమామహేశ్వరి, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.